క్లుప్తంగా

కుమారదేవంలో నేడు గడప గడపకూ..

కొవ్వూరు: కుమారదేవం గ్రామంలో శుక్రవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సారథ్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నియోజకవర్గం పరిధిలోని పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

ఆపదమిత్రలకు అభినందన



ఆపదమిత్రలను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం: మండలం నుంచి ఆపదమిత్రలుగా ఎంపికైన వలంటీర్లు ఇళ్ల కిరణ్‌కుమార్, సునీల్‌బాబు, జయల శిక్షణ పూర్తయింది. అనంతరం స్వగ్రామాలకు వచ్చిన వారిని ఉండ్రాజవరంలో గురువారం ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ బి.శ్రీనివాసు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం



గంగరాజు కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

దేవరపల్లి: సంగాయగూడెంలో ఇటీవల గుండెపోటుతో ఉందుర్తి గంగరాజు మృతి చెందగా అతని కుటుంబ సభ్యులకు తాడేపల్లిగూడెం యునైటెడ్ క్రిస్టియన్ మ్యుజీషియన్ అసోసియేషన్ సభ్యులు రూ.54 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడు గంగరాజు అసోసియేషన్‌లో మ్యుజీషియన్‌గా పనిచేసేవారు. ఆర్థిక సాయాన్ని గంగరాజు, స్వాతి దంపతుల రెండేళ్ల కుమార్తె పేరున పోస్టాఫీస్‌లో గురువారం డిపాజిట్ చేసినట్లు సర్పంచ్ కరుటూరి ఉషారాణి, శ్రీనివాస్ తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు కె.రాజు, నాగేంద్ర, మీసాల వెంకటేష, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో భాగస్వాములు కావాలి

చాగల్లు: సమాజ సేవల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పిచ్చుకల వెంకట సత్యనారాయణ అన్నారు. చాగల్లు ఇందిరమ్మ కాలనీలో చాగల్లు–నేలటూరు లయన్స్ క్లబ్, మదర్‌థెరిసా సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సేవా సమితి నిర్వాహకులు పాలిశెట్టి శ్రీనివాసరావు, వీవీ రామారావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న అధ్యాపకుడు డాక్టర్ రవికుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవాశిబిరంలో భాగంగా గురువారం తొర్రేడు సొసైటీ సమావేశ మందిరంలో పెరటి తోటల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవికుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం వివిధ రకాల కూరగాయల విత్తనాల కిట్లను అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్, తొర్రేడు సొసైటీ అధ్యక్షుడు చిట్టూరి వెంకటరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణలు చేతుల మీదుగా అందించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వ్యవసాయ ప్రదర్శనలు, శాస్త్రవేత్తలు – రైతుల ఇష్టాగోష్టి, ఎన్ఎస్ఎస్ సేవాపథకం ముగింపు కార్యక్రమం జరుగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.హైమజ్యోతి తెలిపారు.

పేదల సేవకు సహృదయ ఫౌండేషన్

రాజమహేంద్రవరం సిటీ: పేదలకు సాయం చేయాలన్న లక్ష్యంతో సహృదయ ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర నాయకుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఫౌండేషన్ ప్రారంభ సందర్భంగా గురువారం సీటీఆర్ఐ రోడ్డు భాస్కర నగర్ బాల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మరుకుర్తి రవి యాదవ్, గోవింద రాజు, కోటిబాబు, గుడే రఘు నరేష్, అడబాల రాజు, దొరబాబు పాల్గొన్నారు.



తాడిపర్రు సీతారాముల కల్యాణోత్సవంలో భక్తులు



కొవ్వూరులో ఆర్యవైశ్య సంఘం నేత గ్రంధి భద్రం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం



చాగల్లులో జైశ్రీరామ్ శోభాయాత్ర



కాటకోటేశ్వరం శ్రీరామ ఆశ్రమంలో శ్రీహనుమత్ రామసుందర గీతికల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

మా ఊరి దేవుడు.. అందాల రాముడు

- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు
- అట్టహాసంగా సీతారాముల కల్యాణం

నిడదవోలు రూరల్/ ఉండ్రాజవరం/ కొవ్వూరు/ చాగల్లు/ తాళ్లపూడి/ పెరవలి/ నల్లజర్ల/ దేవరపల్లి/ ద్వారకాతిరుమల: జగదానందకారకుడైన శ్రీరాముడు, జానకీదేవిల పరిణయ వేడుక నేత్రపర్వంగా జరిగింది.. ఆ స్వామివారి పెళ్లి వేడుకను చూసిన భక్తజనం పరవశించిపోయింది.. శ్రీరామనవమి వేడుకలు గురువారం అట్టహాసంగా జరిగాయి.. నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో ఏ ఊరు చూసినా పెళ్లి సందడే కనిపించింది. చిన్నా పెద్దా రామాలయాలతో పాటు వివిధ ఆలయాలు కిటకిటలాడాయి. మా ఊరి దేవుడు..అందాల రాముడు అంటూ భక్తులు స్వామి అమ్మవార్లను కొలిచారు.



నిడదవోలు కాపులవీధి రామాలయంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు దంపతులు

- నిడదవోలు పట్టణంలోని కాపులవీధి, యాదవుల వీధి, గౌడవీధి రామాలయాలు, మడిపల్లివారి సత్రంలో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు పాల్గొని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిపాటి ఫణీంద్ర, గాజుల రంగారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఉనకరమిల్లిలో సీతారామస్వామి వారి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా స్వామివారి కల్యాణం జరిపించారు. లోక కల్యాణార్థం సూర్నీడి సీతారామయ్య, విజయలక్ష్మి దంపతులు సామూహిక కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు సీతారామచంద్ర స్వామికి పూజలు చేశారు. కాటకోటేశ్వరంలోని శ్రీరామ ఆశ్రమంలో ఎమ్మెల్యే దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీహనుమత్ రామసుందర గీతికల పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మునిపల్లిలో రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. తాళ్లపాలెంలో సీతారామస్వామి దేవస్థానం వద్ద మహిళలు పసుపు, కుంకుమ పూజలు చేశారు. సమిశ్రగూడెంలో సీతారాముల కల్యాణం నిర్వహించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సప్తాహాలు ముగింపు సందర్భంగా పానకాలు పంపిణీ, భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూర్యారావు పాల్గొన్నారు.
- ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సీతా సమేత శ్రీరామచంద్రమూర్తిని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు దర్శించుకున్నారు. జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య, కరుటూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో రాములవారిని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు దర్శించుకున్నారు.
- కొవ్వూరు 15వ వార్డు వాంబే కాలనీ, 11వ వార్డు రామాలయం, ఆర్యవైశ్య సంఘం నేత గ్రంధి వీరభద్రస్వామి ఇంటి వద్ద నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి పాల్గొన్నారు. మెరకవీధి రౌండ్ రామాలయం వద్ద స్వామి కల్యాణోత్సవం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ట్యాక్సీ స్టాండ్ సమీపం అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. గ్రంధి భద్రం స్వగృహంలో నిర్వహించిన నవమి వేడుకల్లో గ్రంధి ప్రవీణ్, సంజన రామేశ్వరీ దంపతులు పూజలు చేశారు.



ద్వారకాతిరుమల చెరువు వీధిలో..

- చాగల్లు మెయిన్ రోడ్డులోని రామాలయం, నేలటూరు సీతారామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకలు జరిగాయి. బ్రాహ్మణగూడెం రామాలయంలో అర్చకుడు పి.ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కలవలపల్లిలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఊరేగించారు. చాగల్లులో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జై శ్రీరామ్ శోభాయాత్ర నిర్వహించారు.
- తాళ్లపూడిలోని పద్మశాలీల రామాలయం వద్ద, వడ్డీల రామాలయం, మదనగోపాలస్వామి ఆలయం, శివాలయం తదితర ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. వేగేశ్వరపురం శ్రీరామ్‌నగర్‌లోని పట్టాభిషేక రామాలయం వద్ద టీటీడీ ధర్మప్రచార సభ్యుడు పరస రాధాకృష్ణ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది. అనంతరం అన్నసమారాధన జరిగింది.
- శ్రీరామ నవమి సందర్భంగా పెరవలి మండలం కాకరపర్రు, తీపర్రు గ్రామాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. అన్నవరప్పాడు, మల్లేశ్వరం గ్రామాల్లో రథంపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు.
- నల్లజర్లలో శ్రీరామకృష్ణ భక్త మందిరంలో పాలుకొల్లుకు చెందిన వేదపండితుడు సామవేదం నగేష్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం దంపతులు పూజాదికాలు నిర్వహించారు. విశ్వేశ్వర సీతారామ మందిరం వద్ద కల్యాణం అనంతరం అన్న సమారాధన జరిగింది. పోతవరం, తూర్పుచోడవరం, తెలికిచెర్లలో జరిగిన వేడుకల్లో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- దేవరపల్లిలోని మెరకవీధి కోదండ రామాలయం, పల్లపు వీధిలోని రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. బందపురం, దుద్దుకూరు, యర్నగూడెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద స్వామివారి కల్యాణోత్సవాలు జరిగాయి.
- ద్వారకాతిరుమల చెరువు వీధిలో రెండు ప్రాంతాల్లో, గుడి సెంటర్‌లో, మావులేటి సోమరాజు సదనం వద్ద సీతారాముల కల్యాణాన్ని కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు.



వేగేశ్వరపురంలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



అన్నవరప్పాడులో సీతారాముల ఊరేగింపు



నల్లజర్లలో శ్రీరామకృష్ణ భక్తమందిరం వద్ద కల్యాణోత్సవంలో పాల్గొన్న వెల్లంకి దంపతులు



తీపర్రులో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సర్వేజనా సుఖినోభవంతి

- ఇందిరమ్మ కాలనీలో నివాసితుల అర్హత నిర్ధారణ
- డీ పట్టాల అందజేతకు సర్వే
- ఏ ఆధారం లేనివారికి హక్కు కల్పించే ప్రయత్నం
- హోం మంత్రి ఆదేశాలతో కార్యచరణ

కొవ్వూరు: ఇందిరమ్మ కాలనీ వాసులకు ఇది నిజంగా శుభవార్తే.. ఇప్పటివరకూ ఇంట్లో ఉంటున్నా హక్కు లేక.. కొందరి నుంచి ఇళ్లు కొనుక్కుని ఆవాసాలు ఏర్పరచుకున్నా సరైన పత్రాలు లేక పాట్లు పడుతున్నారు. అలాంటి వారి అర్హతను నిర్ధారించి డీపట్టాల అందజేతకు కార్యచరణ సిద్ధమైంది. మంత్రి తానేటి వనిత ఆదేశాలతో ఈ పనులు చకచకా జరుగుతున్నాయి. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కొవ్వూరులో ఇందిరమ్మ పథకం మొదటి విడత కింద నిర్మించిన గృహాల్లో నివాసితుల అర్హత నిర్ధారణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున 2006–07లో 1,632 మందికి జీప్లస్ వన్ కేటగిరీలో పట్టాలిచ్చారు. ఇందులో 527 మందికి గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు నిర్మించారు. మిగిలిన 1,105 మందిలో ఇళ్లు నిర్మించుకుని కొందరు, సగం నిర్మాణంలో మరికొందరు అమ్మేసుకున్నారు. ఇలా ఇళ్లు ఐదారుగురి చేతులు మారాయి. ఇక్కడే పెద్ద సమస్య వచ్చింది. ఇళ్లు కొనుక్కుని ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నా తమకు ఏవిధమైన హక్కు పత్రాలు లేకుండా కొందరు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీకి వచ్చిన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితకు కాలనీ వాసులు తమ మొర తెలిపారు. తమకు పట్టాలు ఇప్పించాలని కోరారు. సమగ్ర సర్వే చేయించి అర్హులందరికీ పట్టాలు ఇప్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు.



కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో ఇళ్లు

ఎలా.. ఏం చేస్తారంటే..

అప్పటి ప్రభుత్వం మొదట్లో ఎవరి పేరుతో ఇళ్లు మంజూరు చేసిందో వారి పేరుతోనే పట్టా కొనసాగుతుంది. కరెంటు చార్జీలు, ఆస్తి పన్నులన్నీ వారి పేరుతోనే వస్తున్నాయి. ఈ సమస్యపై కలెక్టర్ బుధవారం అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, మున్సిపల్, గృహనిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతలు నిర్ణయించాలని ఆదేశించారు. అర్హత కలిగిన వారందరికీ డీ పట్టాలు అందజేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం గత నెలలో జీవో జారీ చేసింది. 100 గజాల లోపు డీ పట్టా పొందిన వారు దారిద్ర్య రేఖకు దిగువన, ఎగువన ఉన్న వారైనప్పటికీ పదేళ్లగా నివాసం ఉంటే క్రమబద్ధీకరించనున్నారు. ఇక్కడ కాలనీలో 48 గజాలు మాత్రమే కావడంతో ఈ జీవో వీరికి వర్తించే అవకాశం ఉంది. ఇందులో రెగ్యులైజేషన్ చేయడం ద్వారా ఇంటికి హక్కుదారులుగా మారనున్నారు. వీరికి జగనన్న లేవుట్లు, టిడ్కో కాలనీల్లో ఇళ్లు మంజూరైతే మాత్రం వాటిని రద్దు చేస్తారు. ఇదిలా ఉంటే మొదటి విడతలో ఇళ్లు నిర్మించుకున్న 527 మందిలో ఓటీఎస్ పథకం ద్వారా అసలైన అర్హులు 187 మంది నిర్దేశించిన రూ.15 వేలు సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ పత్రాలు పొందారు. మిగిలిన 340 మందిలో ఇతరుల ఇళ్లు కొనుగోలు చేసుకుని ఉండడం, ఇతర కారణాలతో ముందుకు రాలేదు. ఇటీవల ఈ కాలనీలో మున్సిపల్ అధికారులు సర్వే చేశారు. ఇందులో సుమారు 450 మందికి పైగా లబ్ధిదారులు ఏవిధమైన ఆధారాలు లేకుండా ఉన్నట్లు లెక్క తేల్చారు. మొత్తం 1,632 పట్టాల్లో ప్రభుత్వం నిర్మించిన 527 ఇళ్లు మినహాయిస్తే ఇంకా 1,105 మంది పట్టాలు పొందిన వారున్నారు. వీరిలో అనేక మంది విక్రయాలు జరిపారు. మంత్రి వనిత ఆదేశాల మేరకు వీరి అర్హతలు పరిగణనలోకి తీసుకుని డీ పట్టాలు అందజేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

అర్హతను నిర్ధారిస్తున్నాం..



ఇందిరమ్మ కాలనీలో నివాసితుల వివరాల సేకరణకు సమగ్ర సర్వే చేస్తున్నాం. ఎవరి పేరుతో ఇళ్లు మంజూరైంది. వారు ఎవరెవరికి విక్రయించారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న వారెవరు. వారి అర్హతల వివరాలు సేకరించాం. ఆస్తి పన్ను, కరెంటు బిల్లులు ఎవరి పేరుతో వస్తున్నాయన్న వివరాలు తీసుకున్నాం. ఈ సర్వే కాకుండా రెవెన్యూ ,గృహ నిర్మాణ శాఖ అధికారులు సైతం వివిధ అంశాలపై రీసర్వే చేసి లబ్ధిదారుల అర్హతను నిర్ధారిస్తున్నారు.

– బి.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, కొవ్వూరు

అందరికీ న్యాయం చేస్తాం..



ప్రస్తుతం నివాసితుల అర్హతలను నిర్ధారించేందుకు సమగ్ర కసరత్తు చేస్తున్నాం. అర్హత ఉన్నవారికి డి.పట్టాలు అందజేసి ఇళ్లను క్రమబద్ధీకరిస్తాం. ఏళ్ల తరబడి ఏవిధమైన ఆధారాల్లేకుండా ఉన్నవారు వందల సంఖ్యలో ఉన్నారని అంచనా. పదేళ్లు పైబడి నివాసం ఉంటున్న వారికి కొత్త జీవో ప్రకారం క్రమబద్ధీకరణకు అవకాశం ఉంది. ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన లబ్ధిదారులు మృతి చెందితే వారి వారసులకు హక్కు పత్రాలు అందజేస్తాం.

– ఎస్.మల్లిబాబు, ఆర్డీఓ, కొవ్వూరు

కేసులు ఎత్తివేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

సీటీఆర్ఐ: జిల్లా విభజన సమయంలో కోనసీమలో జరిగిన అల్లర్లలో శెట్టిబలిజ యువతపై నమోదు చేసిన కేసులను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరుమార్చిన సమయంలో జరిగిన అల్లర్లతో సంబంధం లేని అమాయక శెట్టిబలిజ యువకులు, విద్యార్థులను కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెట్టారని చెప్పారు. వీటన్నింటిని ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఇటీవల మంత్రి పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ కోఆర్డినేటర్, ఎంపీ మిధున్ రెడ్డి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ద్వారా సీఎం జగన్‌ను కలిసి వివరించారన్నారు. దీనిపై పెద్ద మనసుతో స్పందించిన సీఎం జగన్ ఆ కేసులను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారని హర్షం వ్యక్తం చేశారు. ఇది ఎమ్మెల్సీగా ఇటీవల ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావు తొలి విజయమని మేడిశెట్టి తాతబ్బాయి సంతోషం వ్యక్తం చేశారు. సానబోయిన రామారావు మాట్లాడుతూ కేసుల్లో ఇరుక్కుంటే యువత భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని సీఎం జగన్‌కు వివరించి, కేసుల ఎత్తివేతకు కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుబ్బల ఉదయ్ భాస్కర్, మట్టపర్తి సత్యనారాయణ, సంఘం ధవళేశ్వరం విభాగం గౌరవాధ్యక్షుడు బత్తిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ గ్రంథాలయం ప్రారంభం

నల్లజర్ల: ఓ ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే పీఎఫ్ సొమ్ముతో ఇల్లు, పొలం కొనడమో, పిల్లల పెళ్లిళ్లు చేయడమో చేస్తారు. కానీ నల్లజర్లలో కూచిభొట్ల రామకృష్ణవెంకట వరప్రసాద్‌కు వచ్చిన పీఎఫ్ సొమ్ముతో వివిధ రచయితల పుస్తకాలు కొన్నారు. మరికొన్నింటిని తానే స్వయంగా రాశారు. ఇలా ఆయన కొన్న పుస్తకాలతో ఇల్లు నిండిపోయింది. ఆ ఇంట్లో పుస్తకాలు తప్ప ఇతర సామగ్రి ఎక్కడా కనిపించదు. జగన్నాథ సాహితీ సమాఖ్య ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల్లో ఉన్న కవులు, రచయితలను ఆహ్వానించి సన్మానాలు, చర్చాగోష్ఠులు కూచిభొట్ల ఏర్పాటు చేసేవారు. గత ఏడాది అక్టోబరు 2న ఆయన మృతి చెందారు. ఆయన సేకరించిన 60 వేల పుస్తకాలు, ఆయన రాసిన పుస్తకాలతో ఆయన కుమారులు జగన్నాథ శాస్త్రి, సోమనాథ్‌లు గురువారం ఆయన 76వ జయంతి సందర్భంగా వారి ఇంటి వద్దే జగన్నాథ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, కవులు, కళాకారులు వచ్చి సందర్శించడానికి అనుకూలంగా ఏర్పాటు చేసినట్టు ఆయన సతీమణి రామలక్ష్మి తెలిపారు.



వరప్రసాద్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో పుస్తకాలు

సాయం చేసి.. ఉదారత చాటి

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కోమరాలు దివ్యదుర్గ ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉంది. స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ఆమె నివాసం ఉంటుంది. దివ్యదుర్గ పరిస్థితి తెలుసుకున్న ఎస్సై కె.రామారావు రెండు బస్తాల బియ్యం అందజేశారు. రెండు నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్గ కాలు విరిగిపోవడంతో ఆమె ఇంటికే పరిమితం అయ్యింది. ఎస్సై రామారావు చొరవతో దాతలు స్పందించి సాయం అందిస్తున్నారు. బుధవారం అమ్మ బ్లడ్ సంస్థ నిర్వాహకులు సమకూర్చిన రూ.20 వేలను ఎస్సై రామారావు ద్వారా దుర్గకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సాయం చేయడంలో సంతృప్తి ఉంటుందన్నారు. అమ్మ బ్లడ్ సంస్థ సభ్యులు రాము, నాగరాజు, మధు, పీవీ రాములు పాల్గొన్నారు.



దివ్యదుర్గకు సాయం అందిస్తున్న సంస్థ నిర్వాహకులు, ఎస్సై రామారావు